క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

భీమునిపట్నం: భీమిలిలోని పలు ప్రాంతాల్లో గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోతుందని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. తగరపువలస నుంచి భీమిలి వరకు ఇటీవల కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, వాటికి సంబంధించిన ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తి చేయాల్సి వుందని తెలిపారు. అందువల్ల గురువారం గంటస్తంభం ప్రాంతం, ఎగువపేట, బోయివీధి, అప్పికొండ వీధి, తోటవీధి, కృష్ణా కాలనీ, గొల్లలపాలెం, బ్యాంకు కాలనీ తదిర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా ఉండదని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని, అవసరమైతే త్రినాథ్ 98660 46100 ను సంప్రదించాలని కోరారు.

ప్రతీ గురువారం బీసీజీ టీకాలు

తగరపువలస : భీమిలి, ఆనందపురం మండలాల్లో క్షయ వ్యాధి నివారణకు గురువారం నుంచి బీసీజీ టీకాలు వేయనున్నారు. ఆనందపురం మండలంలో 4 వేల మందికి, భీమిలి మండలంలో 4,500 మందికి ఈ టీకాలు వేయనున్నారు. ఇందుకోసం ప్రతి మండలంలో 13 చొప్పున గ్రామ సచివాలయాలు, ఆరోగ్య క్లినిక్‌లు సిద్ధంగా ఉంచారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, పొగ తాగేవారు, 60 ఏళ్లు దాటిన వారు, క్షయ వ్యాధిగ్రస్తుల ఇంట్లో ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆనందపురం, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఎం.గంగునాయుడు, ఏబీ మల్లికార్జునరావు మాట్లాడుతూ మే, జూన్ మాసాలలో ప్రతి గురువారం ఈ టీకాలు వేస్తామన్నారు. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, సూచనలు చేసినట్టు సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణమోహన్ తెలిపారు.

ఘనంగా సుత్తమ్మ తల్లి దేవర ఉత్సవం


చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల గ్రామదేవత సుత్తమ్మతల్లికి మంగళవారం రాత్రి ఘనంగా దేవర ఉత్సవం నిర్వహించి బుధవారం అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చారు. బాణసంచా, నేలవేషాలు, సాముగరిడీ, కోలాటం, డీజే, తీన్‌మార్ తదితర హంగామాలతో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. సోమవారం పోలమాంబ అమ్మవారి దేవర, మంగళవారం అనుపోత్సవం జరిగిన సంగతి తెలిసిందే. కాగా ఈ నెల 27, 28, 29న సుత్తమ్మతల్లి తొలేళ్ల రథోత్సవం, పాలధార, అనుపోత్సవం నిర్వహించనున్నారు. 14 గ్రామాల ప్రజలు జరుపుకునే ఈ అమ్మవారి ఉత్సవాలు తిలకించడానికి రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

ఘనంగా ఆశ్రమ వార్షికోత్సవం


పూజలు అందుకున్న సాయినాథుడు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 5 రోజులపాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలి రోజు ఆశ్రమ ప్రాంగణంలో గల శ్రీ శిర్డీ సాయినాథునికి వేకువజామున కాకడ హారతి నిర్వహించి, 108 కలశములతో జలాధివాసము, అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


అధునీకరించిన వసతి గృహంలో టాయిలెట్లు


వసతిగృహం వరండాలో ఆధునికీకరణ పనులు


షాదీఖానాలో వసతుల కల్పన

బంగ్లామెట్టపై అభివృద్ధి పరుగులు


బంగ్లామెట్టపై రక్షణగోడ, సీసీరోడ్డు, మెట్ల నిర్మాణం


సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో ఆధునికీకరణ పనులు


ఆధునికీకరించిన వసతిగృహం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టపై అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేసిన పనుల్లో రూ.1.02 కోట్ల వరకు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. వీటిలో రూ.48.70 లక్షలతో షాదీఖానా ఆధునికీకరణ, వసతుల కల్పన, రూ.17 లక్షలతో జాతీయ రహదారి నుంచి బంగ్లామెట్టకు సీసీ రోడ్డు, మెట్లు, రక్షణ గోడ నిర్మాణం, అలాగే సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహానికి రూ.37 లక్షలతో వసతులు, మరమ్మతులు, ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఒకేచోట మూడు వేర్వేరు పనులు గత ప్రభుత్వాల హయాంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పూర్తవడంతో బంగ్లామెట్ట వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ మూడు అభివృద్ధి పనులు వినియోగానికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్టు స్థానికులు తెలిపారు.

ఇవన్నీ గత ప్రభుత్వాల పాపాలే..

2004కు ముందు టీడీపీ హయాంలో ముస్లింల కోసం నిర్మించిన షాదీఖానా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ఈ షాదీఖానాలో టాయిలెట్లు, వంట గది లేకపోవడంతో 20 ఏళ్లుగా వినియోగానికి నోచుకోలేదు. దీంతో ఈ షాదీఖానాను ఇక్కడి టీడీపీ నాయకులు పశువుల శాలగా, ఎండుగడ్డి దాచుకునే కేంద్రంగా వినియోగించుకున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఇటీవల కళాశాల వసతి గృహంగా మార్చేశారు. పదేళ్లుగా ఈ వసతి గృహానికి టాయిలెట్లు, కిటికీలు, తలుపులు, గచ్చులు శిథిలమైనా పట్టించుకున్న పాపాన పోలేదు. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయగా సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా బంగ్లామెట్ట గ్రామానికి జాతీయ రహదారితో సంబంధాలు తెగిపోయాయి. తరచూ ఈ మార్గంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండటంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకుని రక్షణగోడ, సీసీరోడ్లు, మెట్ల రహదారి నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా దాదాపు పూర్తి కావస్తున్నాయి.

19న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

తగరపువలస : వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ నెల 19న ఉదయం 8 గంటలకు కీటిస్‌పేటలోని శ్రీవిద్య శక్తిపీఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు అమ్మవారి ఉపాసకులు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. వ్రతంలో పాల్గొనే వారికి పీఠం నుంచి పూజా సామగ్రి అందిస్తామన్నారు. వ్రతాలలో పాల్గొనేవారు సాంప్రదాయ వస్త్రాలతో రావాలని కోరారు. వివరాలకు 83283 05636, 89783 78743లో సంప్రదించాలని కోరారు.

యువకుడు అదృశ్యం

పీఎం పాలెం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎం పాలెం ఆర్ హెచ్ కాలనీలో నివసిస్తున్న దుంగా శేఖర్ (21) ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా శేఖర్ ఆచూకీ లభించలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. యువకుడి తండ్రి దేవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఘనంగా జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న పోతిన హనుమంతురావు

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డు మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిన హనుమంతురావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 5, 6, 7వ వార్డుల్లోని ముఖ్య నాయకుల సమక్షంలో మధురవాడలో ఆయన కేక్ కట్ చేశారు.

అవే అనుమానపు చూపులు.. అవమానాలు..

తగరపువలస : పోలింగ్ ముగిసినా భీమిలి నియోజకవర్గంలో టీడీపీ నాయకుల నుంచి జనసేన కార్యకర్తలకు అవమానాలు, అనుమానపు చూపులు వెంటాడుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుచోట్ల జనసైనికులను బలవంతంగా ప్రచార రథాల పైనుంచి దించేయడం, తరిమి కొట్టడం వంటి సంఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. భీమిలిలో గంటా శ్రీనివాసరావు నామినేషన్ సందర్భంగా జనసేన కార్యకర్తలు బల ప్రదర్శనకు వచ్చినా వారికి డబ్బులు ఎగ్గొట్టిన సంఘటనలు జరిగాయి. తక్కువ మందిని తీసుకొచ్చి ఎక్కువ సంఖ్య చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు పట్టుకుపోవడం ద్వారా వారిని టీడీపీ నాయకులు చులకనగా చూడటం మొదలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసే విషయంలోనూ జనసేన కార్యకర్తలకు అవమానాలే ఎదురయ్యాయి. ఓటర్ల సంఖ్య కంటే కొద్ది మొత్తంలో డబ్బులు ఇవ్వడం, అవికూడా జనసైనికుల చేత్తో కాకుండా తామే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తామని టీడీపీ నాయకులు తెగేసి చెప్పేశారు. దీంతో చేసేది లేక కొందరు జన సైనికులు ఎంపీ అభ్యర్థి భరత్‌ను ఆశ్రయించి డబ్బులు తెచ్చుకున్నట్టు తెలిసింది. అక్కడి నుంచి తెచ్చిన డబ్బులు కూడా ఓటర్లకు సరిగ్గా పంచలేదని రెండు రోజులుగా టీడీపీ నాయకులు జనసేన కార్యకర్తలను శంకిస్తున్నారు. జనసైనికులు అసలు గంటాకు ఓటు వేయలేదని ఆరోపిస్తున్నారు. దీంతో వీరి మధ్య విభేదాలు ఏ క్షణమైనా భగ్గుమనే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కోరాడ రాజబాబుకు కూడా తన అనుచరుల నుంచి వేధింపులు తప్పడం లేదు. నాలుగున్నరేళ్లు తిరిగిన తమను గాలికి వదిలేసి గంటా పంచన చేరిపోయావని నిలదీస్తున్నారు. భవిష్యత్తులో రాజబాబుకు ఏ పార్టీ నుంచి ఇన్‌చార్జిగా అవకాశం వచ్చినా సహకరించేది లేదని చెపుతున్నారు. మీకు కూడా నా అనుచరులుగా ప్యాకేజీ ఇవ్వాలని ఎంపీ అభ్యర్థికి 60 మంది వరకు పేర్లు ఇచ్చానని చెప్పి రాజబాబు తప్పించుకుంటున్నట్టు ఆరోపిస్తున్నారు.

19న కుంతీ మాధవ స్వామి చందనోత్సవం



కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పీఎం పాలెం : ప్రమాదానికి గురైన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ శ్రీనివాసనగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న నందిగ చిన్న (27) భవన నిర్మాణ కార్మికుడు. ఈ నెల 4న జీవీఎంసీ 5వ వార్డులోని శివశక్తినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో రాడ్ బెండింగ్ పనులకు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి


ప్రసంగిస్తున్న సుందర్ గోపాల్ ప్రభు

కొమ్మాది : నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధే శ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


సంతపేటలోని ట్రాన్స్‌ఫార్మర్

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో తరచూ విద్యుత్ సరఫరాకు కొందరు ఆకతాయిలు అంతరాయం కలిగిస్తున్నారని చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది వాపోతున్నారు. సంతపేట చిల్డ్రన్స్ పార్కులో వాలీబాల్ ఆడే క్రీడాకారుల్లో కొందరు కావాలనే బాల్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌ను, దానికి అనుసంధానంగా ఉన్న విద్యుత్ వైర్లను తరచూ కొడుతున్నారన్నారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరా ట్రిప్ అయి ఈ ప్రాంతవాసులకు ఆటంకం కలుగుతుందన్నారు. గతంలో చాలాసార్లు హెచ్చరించినా ఇక్కడి యువకులు తీరు మార్చుకోవడం లేదని సిబ్బంది అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని పార్కు ప్రహరీపై పదుల సంఖ్యలో ఆకతాయిలు తిష్ట వేసి బాల్‌తో పదే పదే కొట్టడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వాలీబాల్ ఆడే చోట నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వైపు బాల్ రాకుండా నెట్ కట్టుకోవడం లేదా ప్రహరీపై కూర్చుని బాల్‌తో వైర్లను కొట్టకుండా చూడాలని హెచ్చరిస్తున్నా వారిలో మార్పు రావడం లేదని వాపోతున్నారు. ఇక్కడి ఆకతాయిలపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు సిబ్బంది తెలిపారు.

జీవ వైవిధ్య దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22న బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు. 23న కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 23న జాతీయ సదస్సును ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంతో జీవ వైవిధ్యత ముడిపడి ఉందన్నారు. ప్రతీ వ్యక్తిని భాగస్వాములను చేస్తూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా పనిచేస్తామన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా చేసే కార్యక్రమాలకు తాము సహకారం అందిస్తామన్నారు. సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా వర్సిటీలో జీవవైవిధ్యతను పరిరక్షించాలని సూచించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ బయో డైవర్సిటీ పార్క్‌ను ఏయూలో ఏర్పాటు చేస్తామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా స్థలాన్ని సైతం గుర్తించామన్నారు. ఏయూ వేదికగా వెయ్యి స్టార్టప్ సంస్థలు పనిచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఏయూ టెక్ హబ్‌లో ఇప్పటికే 172 సంస్థలు పని చేస్తున్నాయన్నారు. విదేశీ విద్యార్థుల సంఖ్య వెయ్యి మార్క్‌ను దాటిందన్నారు. ఏయూ నలుమూలలా ఏర్పాటు చేసిన స్టార్టప్ కేంద్రాలు టెక్, ఫార్మా, ఫుడ్ సైన్స్, ఆక్వా రంగాలకు అవసరమైన సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్య దీపిక, ఆచార్య ఎస్.బి.పడాల్, రత్నకుమార్, బలరాం పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం


మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆరుద్ర నిరూపించారన్నారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంగా స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ ఏకేశవరోపాసన హరిహర అభేదం తెలుస్తుందన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి





పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశని(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పుష్పయాగానికి పూల తరలింపు

ఎంవీపీ కాలనీ: తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్మాతిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలను బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమలలో ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు.

కల్యాణ వైభోగం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.